## బీఫామ్ అందుకున్న చింతా ప్రభాకర్



చింతా ప్రభాకర్‌కు పార్టీ బీ-ఫామ్‌ను అందజేస్తున్న సీఎం కేసీఆర్

సంగారెడ్డి, అక్టోబరు16: బీఆర్‌ఎస్ సంగారెడ్డి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను సీఎం కేసీఆర్ సోమవారం హైదరాబాద్ లో పార్టీ బీఫామ్‌ను అందజేశారు. మెజార్టీతో గెలిచి రావాలని చింతా ప్రభాకర్‌కు ధైర్యం చెప్పి, ఇప్పటినుంచి ఎన్నికల సమరశంకాన్ని పూరించాలని సీఎం ఆదేశించారు. పార్టీ బీ-ఫామ్‌తో పాటు ప్రతి అభ్యర్థికి ఎన్నికల ఖర్చులకు రూ.40 లక్షల చెక్కును సీఎం అందజేశారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన అసంఘటిత రంగ కార్మికులు



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అమీన్‌పూర్, అక్టోబర్ 16: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండలంలోని కిష్టారెడ్డిపేట జానకంపేట గ్రామాలకు చెందిన అసంఘటిత కార్మికులు ఆదివారం పటాన్‌చెరులోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు కృష్ణ, పాండు, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, వెంకటేశ్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసుల తనిఖీలో రూ.8.80 లక్షలు పట్టివేత



ఆర్సీపురంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి, సిబ్బంది

రామచంద్రాపురం, అక్టోబర్16: ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇక్రిశాట్ టోల్‌గేట్ వద్ద ఏసీపీ నర్సింహారావు నేతృత్వంలో చెక్‌పోస్ట్ ఏర్పాటుచేశారు. రోజూ వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేస్తున్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు, మద్యం తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం వాహనాల తనిఖీల్లో భాగంగా పటాన్‌చెరు నుంచి ఆర్సీపురం వైపునకు ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.8,80,430 తీసుకువెళ్తుండ డంతో ఆ వాహనాన్ని తనిఖీ చేసి, డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకుని, ఎఫ్ఎస్‌టీకి అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు వాహనాల్లో ఎవరైనా రూ.50 వేలకు మించి డబ్బులు క్యారీ చేయవద్దన్నారు. ఒకవేళ అధిక నగదును తీసుకెళ్లాలంటే అందుకు సంబంధించిన ఆధారాలు పక్కాగా ఉండాలన్నారు.

## 21న పోలీసు అమరవీరుల వారోత్సవాలు



రూపేశ్, ఎస్పీ సంగారెడ్డి

సంగారెడ్డి, అక్టోబరు 16: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఈ నెల 21 నుంచి 31 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సీహెచ్ రూపేశ్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)ను పురస్కరించుకుని రాష్ట్ర పోలీస్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్‌కు సంబంధించి పోటీలను జిల్లా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులు, యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభ తెలిపేలా ఉండే 3 ఫొటోలు, తక్కువ నిడివి గల 6 నిమిషాలు గల షార్ట్‌ఫిల్మ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీలకు ఈ నెల 22వ తేదీ లోపు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ పెన్ డ్రైవ్, 10/8సైజ్ ఫొటోలను పోలీసు పీఆర్‌వోకు అందజేయాలన్నారు. ఈ పోటీలకు 22వ తేదీన నిర్ణయించుమని, ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ (3నిమిషాల నిడివి గల)పోటీలకు సంబంధించినవి ఉండాలన్నారు. వివరాలకు పీఆర్‌వో సెల్ 8712539040లో సంప్రదించాలన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్



మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్

### మరింత అభివృద్ధి చేస్తాం..

# మరోసారి అవకాశం ఇవ్వండి

- అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్
- జోగిపేటలో విస్తృతస్థాయి సమావేశం
- హాజరైన ఎంపీ, జడ్పీ చైర్‌పర్సన్, కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అందోల్, అక్టోబర్ 16: ఎమ్మెల్యేగా మరోసారి అవకాశం ఇవ్వాలని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అందోల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం అందోల్‌లో పార్టీ నూతన కార్యాలయం ప్రారంభించారు. ఎంపీ బీబీపాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ ఫరుఖ్‌హుస్సేన్‌తో కలిసి జోగిపేటలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం జోగిపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2018లో సీఎం కేసీఆర్ తనకు మొదటిసారి అవకాశం ఇవ్వడంతో స్థానిక బిడ్డగా ప్రజలు, నాయకులు ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామా ల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేసి, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించానన్నారు. దీన్ని గుర్తించి సీఎం కేసీఆర్ తనకు రెండోసారి అవకాశం ఇచ్చారని, ఈసారి కూడా పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేసి భారీ మెజార్టీ కట్టబెట్టాలన్నారు.

### కాంగ్రెస్-బీజేపీలకు కాలం చెల్లింది..

కాంగ్రెస్-బీజేపీలకు అందోల్‌లో కాలం చెల్లిందని వారి మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఎమ్మెల్యే అన్నారు. వారికి దమ్ముంటే ఇక్కడ ప్రకటించిన ఆరు గ్యారంటీలు వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయాలని సవాల్ విసిరారు. దామోదర్ ఎన్నికల్లో ఓడితే నియోజకవర్గంలో కనిపించడని, ఎన్నికలప్పుడు మాత్రమే ఆయనకు నియోజకవర్గం గుర్తుకు వస్తుందని, ఇలాంటి నాయకులు మనకు అవసరమా అని ప్రశ్నించారు. 2023 ఎన్నికల మ్యానిఫెస్టో అన్ని వర్గాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నదన్నారు. ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ దేశం గర్వించే రీతిలో తెలంగాణ అభివృద్ధి చెందుతుందని, మరోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలన్నారు. జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మన స్థానిక ముద్దుబిడ్డ క్రాంతి కిరణ్‌ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలన్నారు. స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు ఆరు అబద్ధాలేనని, ఆ పథకాలకు గ్యారెంటీ, వారెంటీ లేదని విమర్శించారు. ఆ పార్టీ పథకాలను ప్రజలు నమ్మే పరిస్థితిలేదన్నారు. ముచ్చటగా మూడోసారి రాష్ట్రంలో గెలిచేది బీఆర్‌ఎస్సేనని, సీఎం అయ్యేది కేసీఆర్ సారేనని ధీమా వ్యక్తం చేశారు.

### కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో జనం లేరు

మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి ఫరూఖ్ హుస్సేన్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు రాష్ట్రంలో కాలం చెల్లిందన్నారు. తాను కాంగ్రెస్‌లో కొన్ని దశాబ్దాలపాటు పని చేశానని, అందులో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లే ఒక్క నాయకుడు లేడని అన్నారు. ఆ పార్టీలో అందరూ సీఎం అభ్యర్థులేనని ఎద్దేవా చేశారు. ఎవరు ఎన్ని హామీలిచ్చినా, ఉచితాలు ప్రకటించినా సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొలేరని, అంత దమ్ము లేదని రాష్ట్రంలో ఈసారి గెలిచి, నిలిచేది బీఆర్‌ఎస్ మాత్రమే అన్నారు. సౌమ్యుడు, మంచి మనిషి అందరికీ ఎప్పుడూ అందుబాటులో ఉండే క్రాంతికిరణ్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, రాహుల్ కిరణ్, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఏఎంసీ చైర్మన్లు పల్లె సంజీవయ్య, విజయలక్ష్మి, మాజీ చైర్మన్లు రజినీకాంత్, మల్లికార్జున్, ఎంపీపీ బాలయ్య, మాజీ ఎంపీపీ రామాగౌడ్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, సర్పంచులు లింగాగౌడ్, ప్రవీణ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేయాలి

- ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి
- మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా



చందాపూర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన మెదక్‌జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

హత్నూర/మెదక్ అర్బన్, అక్టోబర్ 16: సార్వత్రిక ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం హత్నూర మండలం దౌల్తాబాద్ చందాపూర్ గ్రామంలోని ఎఫ్ఎస్‌టీ టీంలు చేస్తున్న తనిఖీలను పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ నగదుతో ప్రయాణం చేయరాదన్నారు. రూ.50 వేలకు మించి నగదుతో వెళితే సరైన ఆధారాలు ఉండాలన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు దొరికితే సీజ్ చేస్తామన్నారు. నడవలేని స్థితిలో వున్న, 80 ఏండ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటేసే సౌకర్యం కల్పించాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద వీల్‌చైర్లు అందుబాటులో ఉంచడంతో పాటు ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల గ్రీవెన్స్ టీం, పీడీడీ ఆర్‌డీవో శ్రీనివాస్ (9281484100), జిల్లా ఆడిట్ అధికారి రమేశ్ (9948213828), జిల్లా ట్రెజరీ అధికారి చిన్నసాయిలు (7799934150)ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అడ్మిన్ మహేందర్

మెదక్ అర్బన్, అక్టోబర్ 16: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు మెదక్ అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పాపన్నపేట గ్రామానికి చెందిన ఇమ్మానియేల్ తనకు రెండు ఏండ్ల క్రితం పక్షవాతం వచ్చిందని, తన కొడుకు చాలా ఇబ్బంది పెడుతున్నాడని, మంగళవారం తన కూతురు దగ్గరికి వెళితే అక్కడికి కూడా వచ్చి కొట్టాడని, ఇదేకాక నిన్న రాత్రి 8 గంటలకు పెద్దవాళ్ల వాడలో ఉండగా కొడుకు, కోడలు, భార్య వచ్చి రాయి ఎత్తేసి కొడతానని బెదిరించి వెళ్లిపోయారని వారిపై చట్టరీత్యా చర్య తీసుకుని న్యాయం చేయాలని ఫిర్యాదు చేశాడు. చట్ట ప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని పాపన్నపేట ఎస్సైకి సూచించారు.